క్లుప్తంగా

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ వీజే కెన్నెడి, చైర్మన్ నిర్మల

నందికొట్కూరు: జనవిజ్ఞాన వేదిక సైన్స్ చెకుముకి సంబరాలు ఈనెల7న నంద్యాల జిల్లా కేంద్రంలోని గురురాఘవేంద్ర స్కూల్‌లో జరిగాయి. జిల్లా స్థాయి పోటీల్లో పట్టణంలోని సెయింట్ మేరీస్ ఇంగ్లిషు మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. 10వ తరగతి విద్యార్థిని అర్షియా, 9వ తరగతి లిఖిత, 8వ తరగతి లలిత్ మూడో బహుమతి అందుకున్నారు. విజేతలను స్కూల్ కరస్పాండెంట్ వీజే కెన్నెడి, చైర్మన్ నిర్మల, ఉపాధ్యాయులు అభినందించారు.

‘జన్‌మన్’తో గిరిజనాభివృద్ధి



పథకం గురించి గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న ఐటీడీఏ పీఓ

శ్రీశైలం: ప్రధాన మంత్రి జన్‌మన్ పథకంతో గిరిజనుల అభివృద్ధి సాధ్యమవుతుందని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి అన్నారు. సోమవారం క్షేత్రపరిధిలోని మేకలబండ చెంచుగూడెంలో సమావేశం నిర్వహించారు. పథకానికి సంబంధించిన 22 రకాల మౌలిక వసతులు, సేవలు గురించి గిరిజనులకు వివరించారు. నెలాఖరులోగా వలంటీర్స్ సహకారంతో సచివాలయం నుంచి నేరుగా అందే కొన్ని పథకాలను, అందుకు అవసరమైన పత్రాలను పొందాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఐటీడీఏ స్పెషల్ ఆఫీసర్ కేజీ నాయక్, తహసీల్దార్ రాజేంద్రసింగ్, ఎంపీడీఓ మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో జొన్న కొనుగోళ్లు

వెలుగోడు: 2023–24 రబీ సీజన్లో సాగు చేసిన జొన్న పంటను ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం క్వింటా రూ. 3180 చొప్పున కొనుగోలు చేయనున్నట్లు ఏఓ పవన్ కుమార్ తెలిపారు. సోమవారం రేగడ గూడూరు, వేల్పనూరులో సాగుచేసిన జొన్న పైరును స్థానిక వ్యవసాయ సిబ్బందితో కలిసి పరిశీలించారు. హమాలీ, రవాణ ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, ఎఫ్ఏ క్యూ నాణ్యతకు లోబడి కొనుగోలు ఉంటాయని చెప్పారు.

మహాశివుడికి జలాభిషేకం

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో వెలసిన శ్రీపార్వతి సమేత మహాశివునికి సోమవారం భక్తులు జలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. మహాశివునికి అత్యంత ప్రీతికరమైన పంచామృతాభిషేకం, విశేష పూజలు, జలాభిషేకం చేశారు. అనంతరం స్వామిఅమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహించారు.

మహానందీశ్వరుడికి పల్లకీ సేవ

మహానంది: మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో అర్చకులు శరభయ్యశర్మ, తదితరులు స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం వైభవంగా జరిగింది.

14న సామూహిక భోగిపండ్ల కార్యక్రమం

శ్రీశైలంటెంపుల్: సంక్రాంతి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 14న (భోగిరోజున) ఉదయం 10 గంటలకు శ్రీశైల ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో భోగిపండ్ల కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

15న ముగ్గులపోటీలు

శ్రీశైలదేవస్థానంలో ఈ నెల 15న సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 గంటలకు ఆలయ దక్షిణమాడవీధిలో ఈ ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి. ఆసక్తి గల మహిళలు 14వ తేదీన సాయంత్రం 5 గంటల లోపు దేవస్థానం పరిపాలనా కార్యా లయంలో ప్రజాసంబంధాల అధికారి విభాగంలో పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

గిరిజన మహిళలకు ముగ్గుల పోటీలు



బహుమతి ప్రదానం చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: గిరిజన మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ కనబరచి ఉన్నత స్థానాలను చేరుకోవాలని హెచ్ఎం. చంద్రశేఖర్, వార్డెన్ పేరయ్య ఆకాంక్షించారు. సోమవారం మండలంలోని గువ్వలకుంట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పాలెంచెరువు గిరిజన గూడెంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు.

రైతన్నకు ‘సహకారం’

- సహకార సంఘాల ఆధ్వర్యంలో బహుళ ప్రయోజన గోదాముల ఏర్పాటు
- రూ. 3.15 కోట్లతో ఐదు గ్రామాల్లో నిర్మాణం
- అన్నదాతలకు స్వల, దీర్ఘకాలిక రుణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



తూర్పు ప్రాతకోట గ్రామంలో నిర్మించిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాము



పడమర ప్రాతకోటలో పూర్తయిన గోదాము

పగిడ్యాల: దేశానికి అన్నం పెట్టే రైతన్నల అభివృద్ధి కోసం జగనన్న ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ప్రతి ఏటా రైతు భరోసా కింద పెట్టుబడి సాయంగా రూ.13,500 నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసి ఆదుకుంటోంది. అంతేకాకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు అందజేస్తున్నారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను తక్కువ ధరకు విక్రయించి నష్టపోరాదని.. మంచి ధర వచ్చేంతవరకూ వాటిని నిల్వ చేసుకునేందుకు గ్రామాల్లో బహుళ ప్రయోజన గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది.

నాబార్డు నిధులతో ఐదు గోదాముల నిర్మాణం

మండల వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో 2021–22 ఆర్థిక సంవత్సరానికి నాబార్డు నిధుల కింద రూ. 3.15 కోట్ల వ్యయంతో మండలంలో ఐదు గోదాముల నిర్మాణాలు రూపుదిద్దుకున్నాయి. పగిడ్యాల, కొత్త ముచ్చుమర్రి, తూర్పు ప్రాతకోట, పడమర ప్రాతకోట, నెహ్రూనగర్ గ్రామాల్లో వెయ్యి మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు (ఎంపీఎఫ్‌సీ) నిర్మించారు.

పట్టాదారు రైతులకు రుణాలు

సహకార పరపతి సంఘం నుంచి పట్టాదారు రైతులకు పంట రుణాలు, దీర్ఘ కాలిక, స్వల్పకాలిక (లాంగ్ టర్మ్, షార్ట్ టర్మ్) రుణాలు, ల్యాండ్ డెవలప్‌మెంట్(మార్ట్‌గేజ్) రుణాలు, జేఎల్‌జీ రుణాలు, ఫిషర్‌మెన్ కిసాన్ క్రెడిట్ రుణాలు పొందేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బంగారు ఆభరణాలపై కూడా రుణాలు ఇచ్చేందుకు వెసులుబాటు కల్పించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన వ్యవసాయ సహకార సంఘాలు జగనన్న పాలనలో జీవం పోసుకుని రైతుల అభ్యున్నతి కోసం పనిచేస్తుండడం పట్ల అన్నదాత ఆనందోత్సవాలను వ్యక్తం చేస్తున్నారు.



గోదాముల నిర్మాణం సంతోషదాయకం



పంట ఉత్పత్తులను నిల్వ చేసుకోవడానికి వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు నిర్మించడం సంతోషదాయకం. గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయమే దండుగా అని మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతు సంక్షేమానికి తూట్లు పొడిచారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వం వచ్చాక రైతుల జీవితాల్లో వెలుగులు నింపారు.

– అస్లాంబాషా, మండల కో ఆప్షన్ సభ్యులు, పడమర ప్రాతకోట

రూ. 11.90 కోట్ల రుణాలు ఇచ్చాం



వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా పంట రుణాలు, లాంగ్ టర్మ్ రుణాలు, ల్యాండ్ డెవలప్‌మెంట్ రుణాలు, జేఎల్‌జీ రుణాలు, ఫిషర్‌మెన్ కిసాన్ క్రెడిట్ రుణాల కింద మండల వ్యాప్తంగా రూ. 11.90 కోట్ల రుణాలు అందించాం. అలాగే రూ. 3.15 కోట్లతో బహుళ ప్రయోజన సౌకర్య గోదాములు ఐదు నిర్మించాం. రైతులు తాము పండించిన పంటలను తక్కువ ధరకు విక్రయించి నష్టపోకూడదని ప్రభుత్వ ఆశయం. – ఖాజా, సీఈఓ, పగిడ్యాల

నేడు డయల్ యువర్ డీఎం

నందికొట్కూరు: ఆర్టీసీ డిపో పరిధిలో మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తునట్లు డీఎం నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. మధ్యాహ్నం 12 నుంచి 1 గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. ప్రయాణికులు, ప్రజలు డిపో పరిధిలో సమస్యలపై 99592 25799నంబర్‌కి ఫోన్ చేయవచ్చన్నారు. అలాగే మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు వారి అమూల్యమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోండి

జూపాడుబంగ్లా: ప్రజలు ఫ్యామిలీ డాక్టర్, 104సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ యశశ్వని తెలిపారు. సోమవారం మండలంలోని కొత్తసిద్దేశ్వరం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్, 104 కార్యక్రమాల్లో భాగంగా వైద్యులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త పద్మావతి, 104 సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

కొత్తపల్లి: స్పందనలో అధికారుల దృష్టికి వచ్చిన ప్రతి అర్జీని తప్పనిసరిగా పరిష్కరిస్తామని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎదురుపాడు, లింగాపురం, ఎర్రమఠం గ్రామాలకు చెందిన ముగ్గురు రైతులు భూమి కొలతల్లో తేడాలు ఉన్నాయని, మళ్లీ కొలతలు వేయాలని అర్జీలు సమర్పించినట్లు తెలిపారు. వీటిపై విచారణ జరిపి సత్వరం పరిష్కరిస్తామని తెలిపారు.

మాట తప్పని సీఎం జగన్



మహానందిలో పింఛన్లు అందిస్తున్న శిల్పా భువనేశ్వరరెడ్డి



పింఛన్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

మహానంది: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు పింఛను మొత్తాన్ని రూ.3వేలకు పెంచిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని శ్రీశైలం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్ రెడ్డి అన్నారు. మహానందిలోని కుమ్మరి శాలివాహన అన్న సత్రం ఆవరణలో సోమవారం నూతనంగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులకు నగదు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో కొత్తగా 56 మందికి పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. పింఛన్లు అందుకుంటున్న వారు ప్రతి ఒక్కరు ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగభూపాల్ రెడ్డి, మహానంది దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మ మహేశ్వర్ రెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, ఎంపీడీఓ శివనాగజ్యోతి, నాయకులు పక్కీరయ్య, రఘురామిరెడ్డి, మండల నాయకులు పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్

నందికొట్కూరు: అర్హులందరికీ పింఛన్ అందజేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో వైఎస్సార్ పెన్షన్ కానుక వారోత్సవాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. వైస్ చైర్మన్లు రబ్బానీ, ప్రశాంతి, ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, కమిషనర్ కిషోర్, ఎంపీడీఓ శోభారాణి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

ఆత్మకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించినట్లు ఎంపీడీఓ మోహన్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలో 4,230, ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 4,650 మందికి నగదు అందజేసి 98 శాతం పంపిణీ పూర్తి చేసినట్లు చెప్పారు.

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం మండలంలో సోమవారం నూతన పింఛన్లను సోమవారం పంపిణీ చేశారు. సచివాలయం– 2 లో సాయంత్రం జరిగిన కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలునాయక్, శ్రీశైలం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జింకా గుండయ్యయాదవ్, మండల నాయకులు గౌస్‌మొహిద్దీన్ లబ్ధిదారులకు నగదు అందజేశారు.

పగిడ్యాల: మండలంలో సోమవారం వైఎస్సార్ పింఛన్ కానుక నగదు సొమ్మును పింఛన్‌దారులకు వలంటీర్లు ఇంటింటికి తిరిగి పంపిణీ చేస్తున్నారు. మండలానికి 74 కొత్త పింఛన్‌లు మంజూరు కాగా పాతవి 4,698 ఉన్నాయి. పింఛన్ సొమ్ము రూ.3 వేలను పాత, కొత్త పింఛన్‌దారులకు అందజేస్తున్నారు. పింఛన్ అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గుంతలు తీసిన వారిపై చర్యలు తీసుకోండి

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని 80బన్నూరు సహకార సొసైటీ స్థలంలో అక్రమంగా గుంతలు తవ్విన వారిపై చర్యలు తీసుకోవాలని సీఈఓ చంద్రశేఖర్‌గౌడు, చైర్మన్ వెంకటరమణ సోమవారం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. జేసీబీతో పాదులతీసిన, తీయించిన తాటిపాడుకు చెందిన నాగరాజు, జూపాడుబంగ్లాకు చెందిన జంగాల శేఖర్‌పై పోలీసుస్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. అలాగే విషయాన్ని తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

జల చౌర్యాన్ని అరికట్టండి

మిడుతూరు: మండలపరిధిలోని జలకనూరు మద్దిగుండం చెరువు నుంచి నీటిని అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, ఆయకట్టుదారులకు న్యాయం చేయాలని జలకనూరు గ్రామ రైతులు నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన కార్యక్రమం సోమవారం చేపట్టారు. అనంతరం చిన్నతరహా నీటిపారుదల శాఖ ఈఈ రఘురామిరెడ్డి, డీఈ శ్రీనివాసులుకు సమస్యతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఎంపీటీసీ హరిసర్వోత్తమరెడ్డి, రైతులు శ్రీనివాసరెడ్డి, పుల్లయ్య, బాషా తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



కోనేటమ్మపల్లిలో క్రీడాకారులకు సామగ్రిని అందజేస్తున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి



క్రీడాకారులకు టీ షర్ట్స్ పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు రూరల్ : క్రీడలతో మానసికోల్లాసం సాధ్యమవుతుందని మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని కోనేటమ్మపల్లి గ్రామంలో ఆడుదాం ఆంధ్ర పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు టీషర్టులు, క్రీడాసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దామోదరరెడ్డి, పంచాయతీ కార్యదర్శి తరుణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే అల్లూరు గ్రామంలో క్రీడాకారులకు వైస్ ఎంపీపీ కట్టా మంజుల టీషర్టులు, టోపీలను అందజేశారు.

క్రీడాకారులకు మంచి భవిష్యత్

నందికొట్కూరు: క్రీడల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులకు మంచి భవిష్యత్ ఉంటుందని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ ఛాంబర్‌లో ఈ నెల 10వ తేదీ నుంచి జరిగే మండల స్థాయి ఆడుదాం ..ఆంధ్ర క్రీడల ఫిక్సర్స్ డ్రా కార్యక్రమాన్ని చైర్మన్ ప్రారంభించారు. అనంతరం సచివాలయం పరిధిలో గెలుపొందిన క్రీడాకారులకు టీ షర్ట్స్, క్యాప్స్ చైర్మన్ పంపిణీ చేశారు. నంద్యాల, కర్నూలు జిల్లాల శాప్ కో ఆర్డినేటర్లు రవికుమార్, శ్రీనాథ్, మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రశాంతి పాల్గొన్నారు.

పండుగలా ఆడుదాం ఆంధ్ర

పాములపాడు: మండలంలోని వేంపెంట గ్రామంలో సోమవారం గ్రామస్థాయి పోటీల్లో చివరి రోజున గెలిచిన క్రీడాకారులకు జెడ్పీహెచ్ స్కూలులో హెచ్ఎం కృష్ణమూర్తి అధ్యక్షతన సర్పంచు మాణిక్యమ్మ టీషర్ట్స్, టోపీలు అందజేశారు. పీఈటీ నాగరాజు, ఉప సర్పంచు ప్రభాకర్ పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటుక్రీడల్లో రాణించటం వల్ల శారీరకదృఢత్వం పెరిగి చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని సర్పంచ్‌లు మొట్టిబాల స్వామి, నాగార్జునరెడ్డి తెలిపారు. సోమవారం జూపాడుబంగ్లా, పి.లింగాపురం గ్రామాల్లో నిర్వహించిన ఆడుదాం-ఆంధ్ర క్రీడల్లో సత్తాచాటి మండల స్థాయి క్రీడలకు ఎంపికైన క్రీడాకారులకు దుస్తువులు పంపిణీ చేశారు.

పగిడ్యాల: మండలానికి మంజూరైన 1140 ఆడుదాం .. ఆంధ్రా క్రీడా దుస్తులను అన్ని గ్రామ సచివాలయాల వద్ద సర్పంచ్‌ల అధ్యక్షతన పంపిణీ చేశారు. సర్పంచ్‌లు పెరుమాళ్ల శేషన్న, పెద్ద ఆంజనేయులు, కాటం శ్రీదేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నేడు కేపీఎల్ ప్రారంభోత్సవం

ఆత్మకూరురూరల్: శ్రీశైలం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి నిర్వహిస్తున్న నియోజకవర్గ స్థాయి మెగా క్రికెట్ టోర్నమెంట్ ‘కేపీఎల్’ (కార్తీక్ ప్రీమియర్ లీగ్) మంగళవారం ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అట్టహాసంగా ప్రారంభించనున్నారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌లో 205 జట్లు పాల్గొననున్నాయి. ఈ జట్లకన్నింటికీ శిల్పాకార్తీక్ రెడ్డి నాణ్యమైన క్రికెట్ కిట్‌లను ప్రారంభోత్సవ కార్యక్రమంలో పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా భారీ మోటార్ సైకిల్ ర్యాలీని కూడా ఏర్పాటు చేశారు. టోర్నీలో విజేతలకు వరుసగా రూ.లక్ష, రూ.50వేలు, రూ.20వేలు, రూ.10వేలు అందజేయనున్నారు. పాల్గొన్న ప్రతి జట్టుకు రూ.2వేలు ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నారు. ఇవికాక ప్రతి మ్యాచ్‌లో వ్యక్తిగత ప్రతిభ చూపిన క్రీడాకారులకు ట్రోఫీలు అందజేస్తారు.

టోర్నీని విజయవంతం చేయండి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గం స్థాయి క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్‌మీర్, రాజమోహన్‌రెడ్డి, కౌన్సిలర్ విజయ చౌదరి, సుల్తాన్, పువ్వాడ భాస్కర్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొలిసారిగా నియోజకవర్గ స్థాయిలో క్రికెట్‌పోటీలు భారీ ఎత్తున నిర్వహిస్తున్నామన్నారు. మ్యాచ్ ప్రారంభోత్సవం ఆత్మకూరు పట్టణంలో జరుగుతుందని, అనంతరం ఆయా మండలాల్లో ఉన్న క్రీడామైదానాల్లో లీగ్ పోటీలు జరుగుతాయన్నారు.



క్రీడామైదానాన్ని పరిశీలిస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

క్రీడా మైదానం పరిశీలన

వెలుగోడు: ఈ నెల 10వ తేదీ నుంచి నిర్వహిస్తున్న కార్తీక్‌రెడ్డి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాట్లను వైఎస్సార్‌సీపీ నాయకుడు శిల్పా కార్తీక్ రెడ్డి పర్యవేక్షించారు. సోమవారం స్థానిక డిగ్రీ కాలేజీ మైదానంలో కె.పి.యల్ టోర్నమెంట్‌కు సిద్ధమైన క్రికెట్ పిచ్‌ను పరిశీలించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, సర్పంచ్ జయపాల్, ఎంపీటీసీ చాంద్ బాషా తదితరులు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించుకోండి

జూపాడుబంగ్లా: సమగ్ర భూసర్వేలో నెలకొన్న సమస్యలను రైతులు లిఖితపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశాల మేరకు పి.లింగాపురం గ్రామంలో గ్రామసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పైలెట్ ప్రాజెక్టుగా పి.లింగాపురం గ్రామంలో మొదటి విడతలో సమగ్రభూసర్వే చేసి, రైతుల పొలాలకు కొలతలు వేసి, సర్వేరాళ్లు పాతడంతో పాటు రైతులకు శాశ్వతభూహక్కు పత్రాలను అందజేసినట్లు తెలిపారు. భూ హక్కు పత్రాల్లో ఏమైన లోటుపాట్లు ఉన్నా పేర్లు, సర్వేనెంబర్లు, విస్తీర్ణం తప్పుగా ముద్రితమైనట్లయితే రైతులు లిఖితపూర్వకంగా గ్రామసభలో తెలియజేయాలన్నారు. వాటిని ఈనెల 21తేదీలోగా పరిష్కరిస్తామని చెప్పారు.

సంక్రాంతి సంబరాలు

జూపాడుబంగ్లా: విద్యార్థులు చదువుతో పాటు ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలని ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రమేష్ అన్నారు. సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని జూపాడుబంగ్లా మోడల్ పాఠశాలలో విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి, ప్రిన్సిపాల్ రమేష్ విద్యార్థినులు వేసిన ముగ్గులను పరిశీలించి.. సుప్రియ, భవాని మొదటి బహుమతి, సోమేశ్వరి, సింధూర ద్వితీయ బహుమతి, హర్షిత, మల్లిక తృతీయ బహుమతికి ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీఈటీ పద్మావతి, ఉపాధ్యాయులు సరిత, ఉష, రాజేశ్వరి, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ లో సోమవారం ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. హెచ్ఎం వెంకటరమణ విద్యార్థులకు పండుగ విశిష్టతను వివరించారు. ఉపాధ్యాయులు దాసు, ప్రదీప్, రాజానాయక్, పుష్పలత, లత తదితరులు పాల్గొన్నారు.



ముగ్గులను పరిశీలిస్తున్న ఎంఈఓ , ప్రిన్సిపాల్

నందికొట్కూరు: సంక్రాంతి పండుగ సందర్భంగా పావని హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు చందన, తేజ, సింధులకు బహుమతులు అందజేశారు. కరస్పాండెంట్ మల్లికార్జునరెడ్డి, అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినిపై యువకుడి దాడి

జూపాడుబంగ్లా: మోడల్‌స్కూల్ ఇంటర్ విద్యార్థినిపై సోమవారం పారుమంచాల గ్రామానికి చెందిన రాజేష్ అనే యువకుడు దాడికి పాల్పడ్డాడు. విషయాన్ని బాధిత విద్యార్థినితో పాటు తోటి విద్యార్థులు ప్రిన్సిపాల్ రమేష్‌కు తెలియజేశారు. దీంతో ఆయన విషయాన్ని వెంటనే బాలిక తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్‌లో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయించారు.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

కొత్తపల్లి: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సంక్రాంతి పర్వదినం సందర్భంగా సెలవులు ప్రభుత్వం ప్రకటించినట్లు ఎంఈఓ శ్రీరాములు సోమవారం తెలిపారు. మండలంలోని పాఠశాలలకు 9 వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తూ విద్యాశాఖ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. 19న పాఠశాలలు పునఃప్రారంభం అవుతాయని తెలిపారు. సెలవు దినాల్లో ఏ పాఠశాలలో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదని, ఎవరైనా నిర్వహిస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మహానంది: బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు గ్రామం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బండిఆత్మకూరు మండలం పెద్ద దేవలాపురం గ్రామానికి చెందిన శివ నాగ ఆచారి స్కూటర్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో శివనాగ ఆచారితో పాటు ఆత్మకూరుకు చెందిన ఆటో డ్రైవర్ శేషు, సిద్దపల్లె గ్రామానికి చెందిన త్యాగరాజుకు గాయాలయ్యాయి. వీరిని స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బండిఆత్మకూరు ఎస్సై మల్లికార్జున వివరాలు సేకరించారు.

శ్రీశైలం తరహాలో మహానంది అభివృద్ధి



భూమిపూజ నిర్వహిస్తున్న శిల్పా భువనేశ్వరరెడ్డి, చైర్మన్, ఈఓ

మహానంది: మహానంది ఆలయ అభివృద్ధి కోసం ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సమగ్ర ప్రణాళికలు రూపొందించారని, శ్రీశైలం తరహాలో అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గం సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్ రెడ్డి తెలిపారు. మహానంది దేవస్థానం ప్రాంగణంలో రూ.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్లు, కల్వర్టులు, డ్రైనేజీల నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర్ రెడ్డి, ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు రవిశంకర అవధాని, అర్చకులు ముందుగా శాస్త్రోక్తంగా పూజలు చేపట్టారు. అనంతరం శిల్పా భువనేశ్వరరెడ్డి మాట్లాడుతూ భక్తుల వసతి సౌకర్యం కోసం రూ.10.50 కోట్లతో వసతి గృహాల నిర్మాణానికి అనుమతులు మంజూరైనట్లు చెప్పారు. దాతల సహకారంతో టాయిలెట్స్ కాంప్లెక్స్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, తహసీల్దార్ జనార్దన్ శెట్టి, మహానంది సర్పంచ్ శిరీష, ఎంపీటీసీ బంగి వెంకటేశ్వర్లు, బీసీ సంఘం నాయకులు గజ్జ పెద్దపకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

మహానంది: మండలంలోని గాజులపల్లె గ్రామానికి చెందిన షేక్ సుభాని వద్ద 15 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సారా విక్రయిస్తున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించి సారా స్వాధీనం చేసుకోవడంతో పాటు 600 లీటర్ల ఊట ధ్వంసంచేసి కేసు నమోదు చేశామన్నారు. గ్రామాల్లో ఎవరైనా సారా విక్రయిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండల పరిధిలోని మల్యాల హంద్రీ–నీవా ఎత్తిపోతల పథకం అప్రోచ్ కాలువలో సోమవారం గుర్తు తెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్.ఐ హుసేన్‌బాషా తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు సోమవారం ఉదయం మల్యాల గ్రామస్తులకు హంద్రీ–నీవా కాలువలో గుర్తు తెలియని మృతదేహం కనిపించడంతో వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించిన పోలీసు సిబ్బంది స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్ఐ తెలిపారు.